(సమగ్ర తెలుగు డిజిటల్ దినపత్రిక)

# ప్రజావేదిక

PRAJA VEDIKA TELUGU DAILY




తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 4 సంచిక : 189 (కాంప్లిమెంటరీ కాపీ) ఎడిటర్:వెంకన్న 18-04 - 2026 పేజీలు : 6 Digital Edition



## కిడ్నీ రోగులకు అందుబాటులోకి



# మెరుగైన వైద్య సేవలు

- ఇక డయాలసిస్ కోసం దూరం వెళ్లక్కర్లేదు..
- తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం
- తెలంగాణలో కొత్తగా 79 డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు
- పీపీపీ పద్ధతిలో 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో నిర్వహణ
- మారుమూల, గిరిజన ప్రాంతాలకు ప్రాధాన్యత

హైదరాబాద్

తెలంగాణలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 79 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. మారుమూల ప్రాంతాల్లోని రోగులు డయాలసిస్ కోసం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ కొత్త కేంద్రాలను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో నిర్వహించనున్నారు.

వివరాలు 2

# దక్షిణాదికి అన్యాయం జరగదు..



- రేవంత్ ఫార్ములా వెనుక అసదుద్దీన్: కిషన్ రెడ్డి
- డీలిమిటేషన్ విషయంపై ప్రజలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయన్న కిషన్ రెడ్డి
- అన్ని రాష్ట్రాలకు మోదీ సమన్యాయం చేస్తారని వ్యాఖ్య
- జనాభా ప్రాతిపదికన సీట్ల విభజన జరిగినా దక్షిణాది ప్రాధాన్యత తగ్గబోదని వెల్లడి
- హైబ్రిడ్ ఫార్ములాను రేవంత్ చేత ఒవైసీ చెప్పించారని విమర్శ

2



## ధాన్యం సేకరణ కోసం కేంద్రమంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్

కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. వానాకాలం

మిగతా 2

- కేంద్రమంత్రి జోషితో రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ
- 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని విజ్ఞప్తి
- రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులపై చర్చ



## శ్రీవాణి నిధులతో 5000 ఆలయాలు..

- రెండేళ్లలో పూర్తికి ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశం
- ఆలయాల్లో తిరుమల తరహాలో అన్నప్రసాద వితరణ చేయాలన్న సీఎం
- దేవాదాయ భూముల రక్షణకు బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ వినియోగించాలని ఆదేశం
- రాష్ట్రంలోని 22 ప్రముఖ దేవాలయాలకు మాస్టర్ ప్లాన్లు రూపొందించాలని సూచన
- దేవాలయాల సమీప ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్న సీఎం

2

# ఏపీకి మరో భారీ పెట్టుబడి..



- రూ.8,175 కోట్లతో లిథియం బ్యాటరీ ఫ్యాక్టరీ
- రాంబిల్లిలో లిథియం అయాన్ బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటు
- రూ.8,175 కోట్ల పెట్టుబడితో వారీ ఎనర్జీ ఫ్యాక్టరీ
- పరిశ్రమ కోసం 300 ఎకరాల భూమిని కేటాయించిన ప్రభుత్వం
- ఈ పరిశ్రమ ద్వారా 3,000 మందికి ఉపాధి అవకాశం
- 2027 జులై నాటికి తొలి దశ పూర్తి చేయడమే లక్ష్యం

అమరావతి

ఏపీకి మరో భారీ పెట్టుబడి వచ్చింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.8,175 కోట్ల వ్యయంతో లిథియం అయాన్ బ్యాటరీల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ప్రముఖ సంస్థ వారీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఫ్యాక్టరీని నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా

మిగతా 2



## డీలిమిటేషన్‌తో నియోజకవర్గ ఓటర్ల సంఖ్యలో సమతుల్యత

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

న్యూఢిల్లీ:

డీలిమిటేషన్ ప్రధాన ఉద్దేశాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా లోక్‌సభకు వివరించారు. ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో భారీ

మిగతా 2




## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో

# భారీగా డ్రగ్స్..

- మహిళా స్మగ్లర్ అరెస్ట్
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 3 కిలోల డ్రగ్స్ పట్టివేత
- బ్యాంకాక్ నుంచి వచ్చిన మహిళా ప్రయాణికురాలి అరెస్ట్
- స్వాధీనం చేసుకున్నది విలువైన హైడ్రోపోనిక్ గంజాయి
- విమానాశ్రయంలో నిఘాను మరింత పటిష్ఠం చేశామన్న అధికారులు

హైదరాబాద్

శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కేంద్రంగా జరుగుతున్న డ్రగ్స్ రవాణాకు కస్టమ్స్ అధికారులు చెక్ పెట్టారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ మహిళా ప్రయాణికురాలి నుంచి సుమారు 3 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని ఈరోజు ఉదయం స్వాధీనం చేసుకున్నారు.వివరాల్లోకి వెళితే, ఇవాళ ఉదయం థాయ్ ఎయిర్‌వేస్ విమానంలో బ్యాంకాక్ నుంచి హైదరాబాద్ వచ్చిన

మిగతా 2

## కిడ్నీ రోగులకు అందుబాటులోకి

# మెరుగైన వైద్య సేవలు

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 79 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. మారుమూల ప్రాంతాల్లోని రోగులు డయాలసిస్ కోసం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త కేంద్రాలను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులు ప్రధాన హబ్‌లుగా వ్యవహరిస్తూ, మిగిలిన కేంద్రాలకు సాంకేతిక మార్గదర్శకత్వం అందిస్తాయి. కొత్త కేంద్రాలతో పాటు ఇప్పటికే ఉన్న 67 డయాలసిస్ సెంటర్లలో అదనంగా 155 యంత్రాలను ఏర్పాటు చేసి పడకల సామర్థ్యాన్ని కూడా పెంచనున్నారు.ప్రతి 25 కిలోమీటర్ల పరిధిలోను ఒక డయాలసిస్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ ఆలోచన. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఆసిఫాబాద్ వంటి ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కొత్త కేంద్రాల ద్వారా మొత్తం 416 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో కేంద్రంలో 5 నుంచి 10 డయాలసిస్ యంత్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.ఈ నిర్ణయంతో కిడ్నీ రోగులు చికిత్స కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. అత్యవసర సమయాల్లోనూ వేగంగా వైద్యం అందే అవకాశం కలుగుతుంది.

ఈ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన టెండర్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# శ్రీవాణి నిధులతో 5000 ఆలయాలు..

**అమరావతి**

రాష్ట్రవ్యాప్తంగా శ్రీవాణి నిధుల వినియోగంతో 5 వేల దేవాలయాలను రాబోయే రెండేళ్లలో పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ ఆలయాల నిర్మాణ పనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఒక రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. గురువారం సచివాలయంలో దేవాదాయ శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.." శ్రీవాణి నిధులతో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలు నిర్మించాలని గతంలోనే నిర్ణయించాం. ఈ ఆలయాల నిర్మాణ బాధ్యత జిల్లా యంత్రాంగానికి అప్పగించాలని ఆలోచన చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో నియోజకవర్గంలో 25-30 వరకూ ఆలయాలను నిర్మించే అవకాశం ఉంటుంది. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఆలయాల నిర్మాణాన్ని చేపట్టాలి. వారి నుంచి ప్రతిపాదనలు తీసుకుని నిర్మాణం చేపట్టండి. ఆలయాల నిర్మాణానికి సంబంధించి మూడు రకాల డిజైన్లతో పైలెట్ ప్రాజెక్టుగా నిర్మించాలి. వీటి నిర్మాణానికి సంబంధించి త్వరితగతిన అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. ప్రతీ దేవాలయానికీ ప్రహరీ నిర్మాణం చేపట్టాలి. "అని సీఎం స్పష్టం చేశారు.

### పవిత్రతతో పాటు పారిశుద్ధ్యమూ ముఖ్యం

"రాష్ట్రంలోని 22 ప్రముఖ దేవాలయాలకు మాస్టర్ ప్లాన్లు రూపొందించాలి. ఇప్పటి వరకు సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, పెనుగంచిప్రోలు, శ్రీకాళహస్తి, కాణిపాకం దేవాలయాలకు మాస్టర్ ప్లాన్లు సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన దేవాలయాలకు కూడా మాస్టర్ ప్లాన్‌లను త్వరితగతిన రూపొందించాలి. ఈ మాస్టర్ ప్లాన్ ల ద్వారా భక్తులకు మెరుగైన సదుపాయాలు, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, నివాస సౌకర్యాలు, పరిశుభ్రత వంటి అంశాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలి. దేవాలయాల్లో పవిత్రతో పాటు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమివ్వాలి. దేవుణ్ణి దర్శించుకోవడానికి వచ్చే భక్తులు భక్తి భావంతో దర్శనం చేసుకునే వాతావరణం ఉండేలా చేయడంతో పాటు.. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే భక్తులు సంతృప్తితో తిరిగి వెళ్తారు. గతంతో పోల్చుకుంటే రాష్ట్రంలోని దేవాలయాలకు భక్తుల సందర్శన పెద్ద ఎత్తున పెరుగుతోంది. ప్రధాన దేవాలయాల్లో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. 2025-26 సంవత్సరంలో శ్రీశైలం, విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయాల్లో 1.20 కోట్లకు పైగా భక్తులు దర్శించుకున్నారు. శ్రీకాళహస్తిలో 83.88 లక్షలు, సింహాచలంలో 65.48 లక్షలు, అన్నవరంలో 57.87 లక్షలు, ద్వారకా తిరుమలను 55.15 లక్షల మంది భక్తులు సందర్శించారు. దేవాలయాలకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత దేవాదాయ శాఖపైనే ఉంది. భక్తులకు తాగు నీటి సౌకర్యం మొదలుకుని అన్నదానం వరకు అన్ని రకాల సేవలను అందించాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

### తిరుమల తరహాలో అన్న ప్రసాద వితరణ చేపట్టాలి

"రాష్ట్రంలోని 111 దేవాలయాల్లో అన్న ప్రసాదాన్ని అందిస్తుంటే... 65 దేవాలయాల్లో నిత్యాన్నదానం అందిస్తున్నాం. తిరుమల తరహాలోనే ఇతర దేవాలయాల్లోనూ అన్న ప్రసాదం అందించాలి. ప్రస్తుతం రాష్ట్రంలోని దేవాలయాల్లో రోజుకు సుమారు 80 వేల మంది భక్తులకు అన్న ప్రసాదం అందుతోంది. దీని కోసం ఏడాదికి రూ. 157.85 కోట్లు వ్యయం అవుతోంది. ఆయా దేవాలయాల్లో పాకశాలల్లో పని చేసే వారికి శిక్షణ ఇప్పించాలి. దేవాలయాల అభివృద్ధికి కామన్ గుడ్ ఫండ్ ద్వారా జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. నిర్దిష్టమైన గడువులోగా సీజీఎఫ్ నిధులతో చేపట్టే దేవాలయాల నిర్మాణాలను పూర్తి చేయాలి. అన్ని ప్రధాన ఆలయాల్లో వాట్సాప్ ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. అన్ని రకాల సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలి. అన్ని ఆలయాలకూ ప్రత్యేక వెబ్‌సైట్లు రూపొందించాలి. సమగ్ర వివరాలతో డ్యాష్‌బోర్డ్ కూడా అందుబాటులోకి తీసుకురావాలి. ఆగమ సలహా మండలి, ఎండోమెంట్ ట్రిబ్యునల్ ఛైర్మన్, స్టాండింగ్ కౌన్సిల్ నియామకాన్ని త్వరితగతిన చేపట్టండి. ఇంకా పెండింగులో ఉన్న దేవాలయాల పాలక మండళ్లను వెంటనే నియమించాలి."అని సీఎం సూచించారు.

### దేవాలయాల సమీప ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి

"ఆధ్యాత్మిక టూరిజం ప్రమోట్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. అన్ని దేవాలయాల వద్ద వసతి సౌకర్యాలు మెరుగవ్వాలి. ప్రముఖ దేవాలయాలు ఉన్న ప్రాంతాలన్నీ అభివృద్ధి జరిగేలా చూడాలి. దీని కోసం టెంపుల్ టౌన్ డెవలప్‌మెంట్ ప్లాన్ సిద్ధం చేయాలి. భక్తుల రద్దీ నియంత్రణ విషయంలో టీటీడీ అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేయండి. కేవలం భద్రత ఆధారంగా కాకుండా సంప్రదాయం ప్రకారం దేవాలయాల్లో నిబంధనలు ఉండాలి. దేవాదాయ భూముల రక్షణకు బ్లాక్ చైన్ టెక్నాలజీని వినియోగించాలి. దేవాదాయ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి. ఈవోలు బదిలీపై వెళ్లే సమయంలో కొత్తగా వచ్చే అధికారులకు ముఖ్యమైన వివరాలను అందించి వెళ్లాలి" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఓటింగ్‌కు ముందు మోదీని కలిసిన రిజిజు

**న్యూఢిల్లీ:**

లోక్‌సభలో మూడు బిల్లులపై కీలకమైన ఓటింగ్ జరుగనుండటంతో శుక్రవారం సాయంత్రం లోక్‌సభలో ఉత్కంఠ నెలకొంది. ఓటింగ్ మరి కాసేపట్లో ఉందనగా కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలుసుకున్నారు. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు, డీలిమిటేషన్‌పై లోక్‌సభ జరిగిన సుదీర్ఘ చర్చకు హోం మంత్రి అమిత్‌షా సాయంత్రం 6 గంటలకు సమాధానం ఇస్తారు. అనంతరం సభలో ఓటింగ్ జరుగుతుంది. పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతివ్వాలని ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఉదయం పిలుపునిచ్చారు. పార్లమెంట్ సభ్యులంతా తమ మనస్సాక్షికి అనుగుణంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో గొప్ప అవకాశమని ఆయన కొనియాడారు. మహిళలకు తగిన హక్కులను కల్పించడంలో అందరం సమష్టిగా చరిత్ర సృష్టించాలన్నారు. ఏకాభిప్రాయంతో ఈ సవరణను ఆమోదించాలని, దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని 'ఎక్స్' వేదికగా ప్రధాని కోరారు. ఈ సవరణ ఏకాభిప్రాయంతో ఆమోదం పొందితే దేశంలో మహిళా శక్తి మరింత బలోపేతమవుతుందని, ఫలితంగా దేశ ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని అన్నారు. 'రండి.. ఈ రోజు మనమందరం కలిసి చరిత్ర సృష్టిద్దాం' అని మోదీ పిలుపునిచ్చారు.

కాగా, రాజ్యాంగ సవరణకు అవసరమైన 2/3 వంతు సుమారు 362 ఓట్లు మెజారిటీ కేంద్ర ప్రభుత్వం వద్ద లేకపోవడంతో బిల్లుల ఆమోదం సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. మ్యాజిక్ ఫిగర్‌పై ఎన్డీయే మాత్రం ధీమా వ్యక్తం చేస్తోంది. సొంత బలం 293 మాత్రమే ఉన్నప్పటికీ, తటస్థ పార్టీల మద్దతుతో మేజిక్ ఫిగర్ దాటుతామని ఎన్డీయే ఎంపీలు చెబుతున్నారు. మరోవైపు డీలిమిటేషన్ క్లాజ్‌ను తొలగించకపోతే బిల్లులను అడ్డుకుంటామని కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి స్పష్టం చేసింది.

## పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు... మరో స్టాండప్ కమెడియన్ అరెస్ట్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత విమర్శలకు దిగిన ఇద్దరు స్టాండప్ కమెడియన్లపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే అనుదీప్ కటికల అనే కమెడియన్‌ను అరెస్ట్ చేయగా, తాజాగా విశాఖపట్నంకు చెందిన మరో కమెడియన్ రఫీక్ మొహమ్మద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హాస్యం పేరుతో సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఈ ఘటనలు తీవ్ర చర్చకు దారితీశాయి.గత కొంతకాలంగా పవన్ వైవాహిక జీవితం, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచేలా కొందరు సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ కల్యాణ్‌తో పాటు రామ్ చరణ్, ఉపాసన, నారా లోకేశ్, నందమూరి బాలకృష్ణలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనుదీప్ కటికలను కాకినాడ పోలీసులు ఉత్తరప్రదేశ్‌లో అరెస్ట్ చేశారు. ఈ ఘటన మరువక ముందే రఫీక్ మొహమ్మద్ అనే కమెడియన్ గతంలో చేసిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. పవన్ ముగ్గురు భార్యల గురించి, ముఖ్యంగా ఆయన భార్య అన్నా లెజినోవా గురించి రఫీక్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయి.

ఈ వ్యాఖ్యలు సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని జనసేన నేత సాయన శివనారాయణ మచిలీపట్నంలోని చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం రాత్రి విశాఖపట్నంలోని రఫీక్ నివాసానికి వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

పవన్ కల్యాణ్ ఇప్పుడు కేవలం సినీ నటుడు మాత్రమే కాదు, రాష్ట్ర డిప్యూటీ సీఎంగా కీలక హోదాలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే రాజకీయ ప్రత్యర్థుల ప్రోద్బలంతోనే ఈ కమెడియన్లు వరుసగా దాడులకు దిగుతున్నారని కూటమి మద్దతుదారులు ఆరోపిస్తున్నారు.

## ధాన్యం సేకరణ కోసం కేంద్రమంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

యాసంగి పంటకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని వారు కేంద్రమంత్రిని కోరారు. 2025-26 సీజన్ కు గాను యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ధాన్యం సేకరణ, కేంద్ర ప్రభుత్వం వాటా సంబంధిత అంశాలపై కేంద్రమంత్రితో వారు చర్చించారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులను మంజూరు చేయాలని వారు కోరారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా డ్రగ్స్..

(మొదటిపేజీ తరువాయి)

మహిళ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో కస్టమ్స్ అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, అందులో దాచి ఉంచిన డ్రగ్స్ బయటపడ్డాయి.స్వాధీనం చేసుకున్నది సాధారణ గంజాయి కాదని, అధిక మత్తునిచ్చే హైడ్రోపోనిక్ గంజాయి అని అధికారులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీనికి భారీ ధర ఉంటుందని చెప్పారు. పట్టుబడిన మహిళను అరెస్ట్ చేసి, రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు. ఆమె కేవలం కొరియరా? లేక అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాతో సంబంధాలున్నాయా? అనే కోణంలో ఆరా తీస్తున్నారు.నగరంలో ఎవరికి ఈ డ్రగ్స్ డెలివరీ చేసేందుకు ఆమె వచ్చిందనే వివరాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల బ్యాంకాక్, దుబాయ్ వంటి ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ అక్రమ రవాణా పెరిగిన నేపథ్యంలో, శంషాబాద్ విమానాశ్రయంలో నిఘాను మరింత పటిష్ఠం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## దక్షిణాదికి అన్యాయం జరగదు..

**ఢిల్లీ**

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణలో సాగుతున్న ప్రచారాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో మీడియా ముఖంగా మాట్లాడిన ఆయన... ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ 'నార్త్ వర్సెస్ సౌత్' వివాదాన్ని సృష్టించేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ప్రధాని మోదీ సమన్యాయం చేస్తారని, జనాభా ప్రాతిపదికన సీట్ల విభజన జరిగినా దక్షిణాది ప్రాధాన్యత తగ్గబోదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏపీలో సీట్లు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కు, తమిళనాడులో 39 నుంచి 59కి పెరిగే అవకాశం ఉందని ఆయన గణాంకాలను వివరించారు.మరోవైపు, మహిళా రిజర్వేషన్ బిల్లుపై కూడా కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మజ్లిస్ పార్టీ తన సీట్లు ఎక్కడ పోతాయో అన్న భయంతో మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోందని, ఆ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ ఫార్ములా అసలు ఆయనది కాదని, అది అసదుద్దీన్ ఓవైసీ వెనుక ఉండి చెప్పించిన ఫార్ములా అని ఆయన ఆరోపించారు. కేవలం హైదరాబాద్‌లో ఎక్కువ ఆదాయం వస్తుందని అక్కడ సీట్లు పెంచమంటారా? అని ప్రశ్నించిన ఆయన... డబ్బున్న చోట ఓటు విలువ ఎక్కువగా ఉండాలని కోరుకోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యం అని నిలదీశారు. మహిళలను అణగదొక్కే రాజకీయాలకు ఎంఐఎం కేంద్ర బిందువుగా మారిందని, విపక్షాలన్నీ కలిసి మహిళా నాయకత్వాన్ని అడ్డుకుంటున్నాయని ధ్వజమెత్తారు.

# ఏపీకి మరో భారీ పెట్టుబడి..

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.ఈ పరిశ్రమ కోసం ఏపీ ప్రభుత్వం 300 ఎకరాల భూమిని కేటాయించింది. మొత్తం 16 గిగావాట్ అవర్ సామర్థ్యంతో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీలో సెల్, ప్యాక్, స్టోరేజ్‌కు అవసరమైన బ్యాటరీలను తయారు చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 3,000 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. మొదటి దశ పనులను 2027 జులై నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ భారీ పరిశ్రమ రాబోతోంది. ఇటీవల కాలంలో విశాఖకు ఐటీ, అనకాపల్లికి పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు వస్తున్నాయి. ఇక ఈ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్న వారీ సంస్థకు గుజరాత్, అమెరికాలోని టెక్సాస్‌లో సోలార్ మాడ్యూల్స్ తయారీ యూనిట్లు ఉన్నాయి. సుమారు 30 దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తూ అంతర్జాతీయంగా మంచి గుర్తింపు పొందింది.భవిష్యత్తులో ఈ ప్లాంట్‌ను మరింత విస్తరించాలని వారీ సంస్థ ప్రణాళికలు రచిస్తోంది. అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) లిథియం అయాన్ సెల్స్, బ్యాటరీ ప్యాక్‌ల తయారీ సామర్థ్యాన్ని 20 గిగావాట్ అవర్ వరకు పెంచాలని భావిస్తోంది. విద్యుత్ నిల్వకు కీలకమైన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) తయారీపై దృష్టి సారించనుంది. దేశంలోనే ఇటువంటి ప్రాజెక్టులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో అనకాపల్లి జిల్లా పారిశ్రామిక చిత్రపటంలో ఈ ఫ్యాక్టరీ కీలకపాత్ర పోషించనుంది.

## డీలిమిటేషన్‌తో నియోజకవర్గ ఓటర్ల సంఖ్యలో సమతుల్యత : అమిత్‌షా

(మొదటిపేజీ తరువాయి)

వ్యత్యాసం ఉందని చెప్పారు. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం అమిత్‌షా లోక్‌సభలో సమాధానమిస్తూ, నియోజకవర్గాల్లోని జనాభాలో భారీ వ్యత్యాసం కారణంగా ఒక్కో ఎంపీ లక్షలాది మంది ఓటర్ల సమస్యలను వినడటం కష్టంగా మారిందన్నారు. ఒక చోట 39 మంది లక్షల మంది ఓటర్లుంటే, మరో చోట 60 వేల మంది ఓటర్లున్నారని, ఇలా నియోజకవర్గాల్లో జనాభా వ్యత్యాసాలున్నాయని చెప్పారు. డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో సమతుల్యతను సాధించేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. తద్వారా ఎంపీ లాడ్స్‌ను కూడా సమర్ధవంతగా వినియోగించుకునే వీలుంటుందని చెప్పారు.

## మైనర్ బాలికతో ఎట్టి చాకిరి యజమానిపై కేసు నమోదు



అనంతగిరి ఏప్రిల్ 17 ప్రజావేదిక ప్రతినిధి

పాలవరం గ్రామ శివారులోని పంట పొలాలలో సుబ్బులు అనే ఏడు సంవత్సరాల మైనర్ బాలిక బాతులు మేపుతున్నదని గుర్తించి గ్రామంలోని యువకులు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి సమాచారం ఇచ్చినారు. ఆ సమాచారం మేరకు ఐసిడిఎస్, ఐసిపిఎస్, సిహెచ్ఎల్, 1098 స్టాఫ్ వారు అక్కడికి వెళ్లి ఆ పాపను అనంతగిరి పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చినారు. పాపతో మాట్లాడగా పాప యొక్క తల్లిదండ్రులైన సుబ్బయ్య, లక్ష్మి అనువారు గత నాలుగు సంవత్సరాల క్రితం బాతుల యజమాని అయిన పాలకుర్తి శ్రీకాంత్ కోదాడ వద్ద ఉంచి వెళ్ళిపోయినారని తెలిపినది. అప్పటినుంచి యజమాని అయిన పాలకుర్తి శ్రీకాంత్ ఈ బాలికను తమ ఇంట్లో పెట్టి చాకిరి మరియు బాతులు మేపించడం, అదేవిధంగా కొట్టడం, తిట్టడం జరుగుతుంది అని తెలిపింది. ఇట్టి విషయంలో చైల్డ్ ఆఫీసర్ శ్రీమతి నిమ్మగడ్డ శేషారత్నం, సహాయక కార్మిక అధికారి,కోదాడ ఫిర్యాదు మేరకు పాలకీర్తి శ్రీకాంత్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనట్లు.ఏఎస్ఐ సిహెచ్ లింగారెడ్డి తెలిపారు.

## శ్రీ లింగాల కమలరాజుని కలిసిన చింతకాని సోషల్ మీడియా నాయకులు.



చింతకాని ఏప్రిల్ 17 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు

ఈరోజు ఖమ్మం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ లింగాల కమల రాజు గారిని చింతకాని మండల యూత్ విభాగం సోషల్ మీడియా నాయకులు మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది.

## టెన్త్ క్లాస్ సర్టిఫికెట్ మిస్సింగ్

చింతకాని ఏప్రిల్ 17

ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు



చింతకానిపరిధిలోని తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన పురం శిరీష ౹/శీ అప్పారావు 23/3/ 2026 తిమ్మినేనిపాలెం నుంచి చింతకాని బండిమీద వెళు తుండగా మార్గమధ్యలో టెన్త్ క్లాస్ మెమో జారి కిందపడి పోవడం జరిగింది దొరికినవారు ఈ నెంబర్ కి కాల్ చేయగలరు. 8096879978

## ఉచిత డెంటల్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఉపసర్పంచ్ తంగిరాల మాధవి



చింతకాని ఏప్రిల్ 17 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు

చింతకాని మండలం చిన్నమండవ గ్రామంలో ఈరోజు మమత డెంటల్ కాలేజీ ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఉచిత డెంటల్ వైద్య శిబిరాన్ని ఉప సర్పంచ్ తంగిరాల మాధవి ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ మమత డెంటల్ హాస్పిటల్ వారు మా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అనేది సంతోషకరమని అన్నారు.మమత డాక్టర్స్ టీమ్ లీడర్ డాక్టర్ దర్శిక గారికి వైద్య సేవలను గ్రామంలో అందించినందుకు ఉప సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణ,వార్డ్ మెంబర్స్ పర్చగని వెంకటరాములు, గుండ్ల బేబీ రాణి, గుండ్ల భద్రమ్మ , తుపాకుల లక్ష్మీనారాయణ , గంటేల స్వామి దాసు పర్చగని ఏడుకొండలు పర్చగని వేణు , పాస్టర్ దానియేలు రాచకొండ వీరయ్య మరియు అనేకమంది గ్రామస్తులు వైద్య సేవలును పొందారు.

# ఒక నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం..

-- రోడ్డు భద్రత వారోత్సవాల్లో ఏసీపీ సైదయ్య హెచ్చరిక...

బోనకల్ ఏప్రిల్ 17 ప్రజావేదిక ప్రతినిధి; (తెల్లబోయిన సుమన్)



రోడ్డు మీద వాహనం నడిపేటప్పుడు చేసే చిన్న నిర్లక్ష్యం కూడా నిండు ప్రాణాలను బలిగొనాల్సిన పరిస్థితి తీసుకురాగలదని వైరా ఏసీపీ సైదయ్య హెచ్చరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా ప్రచారం -2026 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మండల పరిధిలో ఉన్న చిరునోముల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగింది. గ్రామ సర్పంచ్ అనుమోల చంద్రకళ అధ్యక్షతన గ్రామంలో ఉన్న టు వీలర్ వాహనదారులకు హెల్మెట్లు సొంత ఖర్చుతో అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ సైదయ్య మాట్లాడుతూ,రోడ్డు ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరగవని, వాటిలో ఎక్కువ భాగం డ్రైవర్ల నిర్లక్ష్యం, అవగాహన లోపం వల్లనే జరుగుతున్నాయని తెలిపారు. ఒక్క క్షణం అజాగ్రత్త ఒక కుటుంబాన్ని జీవితాంతం విషాదంలో ముంచే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

మోటార్ సైకిల్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ పెట్టుకోవడం మాత్రమే కాకుండా దాని పట్టీ బిగించుకోవడం అత్యంత ముఖ్యమని సూచించారు. ప్రమాద సమయంలో తలను రక్షించేది హెల్మెట్ మాత్రమేనని, అది ప్రాణాలకు కవచంలాంటిదని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, అలాంటి చర్యలు కేవలం మన ప్రాణాలనే కాదు, ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తాయని హెచ్చరించారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అధిక వేగంతో వాహనం నడపడం వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని వివరించారు.

కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, గ్రామీణ ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఆటోలు నడిపే వారు రాత్రివేళల్లో రిఫ్లెక్టర్లు, రేడియం స్టిక్కర్లు వినియోగించాలని సూచించారు. చిన్న చిన్న జాగ్రత్తలు ప్రాణాలను కాపాడగలవని అన్నారు.

ప్రమాదం జరిగిన తర్వాత బాధపడటం కన్నా ముందే జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ తమ భద్రతను తామే కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో బోనకల్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పొదిలి వెంకన్న , ఉప సర్పంచ్ నిమ్మ తోట రఘు , మరియు మధిర వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ అనుమోలు వెంకటేష్ ,బోనకల్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై రోడ్డు భద్రతపై అవగాహన పొందారు.

# తిర్లాపురం గ్రామంలో ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి.

- ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చింతకానిమండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు హాజరయ్యారు.

చింతకాని ఏప్రిల్ 17 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు



చింతకాని మండల పరిధిలో తిర్లాపురం గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాడు భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్‌వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా చింతకానిమండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు మరియు తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు హాజరయ్యారు.ఆయన చిత్రపటానికి కొబ్బరికాయ కొట్టి,పూలమా లలు వేసి నివాళ్లు అర్పించారు. ఎంఈఓ. మాట్లాడుతూ..జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 5, 1888, ఈ రోజును 'ఉపాధ్యాయ దినోత్సవం'గా జరుపుకుంటారు.భారతదేశపు రెండవ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త మరియు విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 17న నిర్వహించబడుతుంది. ఆయన 1975 ఏప్రిల్ 17న కన్నుమూశారు. విద్య, నైతిక విలువలకు ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన సేవలను గుర్తు చేసుకోవాలని తెలియపరిచారు.

గ్రామ సర్పంచ్

మాట్లాడుతూ.....సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశపు ప్రముఖ తత్వవేత్త, ఉపాధ్యాయుడు మరియు రాజకీయ నాయకుడు. ఆయన భారతదేశపు రెండవ రాష్ట్రపతిగా సేవలందించారు. ఆయన జీవితం పూర్తిగా విద్య మరియు తత్వశాస్త్రానికి అంకితం చేయబడింది.ఆయన విద్యార్థులకు ఒక ఆదర్శం, ఉపాధ్యాయులకు ఒక మార్గదర్శకుడు. ఆయన అభిప్రాయం ప్రకారం, విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం కాకుండా, మనిషి వ్యక్తిత్వాన్ని నిర్మించే ఒక శక్తి. రాధాకృష్ణన్ గారి జీవితం సమాజంపై గొప్ప ప్రభావాన్ని చూపింది. ఆయన వల్ల విద్యకు మరింత గౌరవం పెరిగింది.

ఆయన ఆలోచనలు యువతలో మంచి విలువలను పెంపొందించాయి. ఆయన ఒక రోల్ మోడల్ గా నిలిచారు అని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాసరావు, తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం స్వాతి మేడం, ఉపాధ్యాయుడు పీతం, నాలుగో వార్డ్ సభ్యుడు చాపలమడుగు మధు, అంగన్వాడీ టీచర్ సీతా నాగరత్నం, ఆశ వర్కర్ చాపలమడుగు రాణి, చాపలమడుగు సుస్మిత,అంగన్వాడి ఆయా అంజమ్మ, బండి వెంకమ్మ,గోగుల నాగేశ్వరరావు, ఐతం సీతారాములు,యువతి యువకులు, పాఠశాల పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ,ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ కు వినతి.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 17.

తెలంగాణ ఉద్యోగ గెజిటెడ్ అధికారులు,ఉపాధ్యాయ,పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న సమస్యలపై బయ్యారం తాహాశీల్దార్ నాగరాజు వినతి పత్రం అందించారు.



ఈ సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు నాయకులు మాట్లాడుతూ పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని,పిఆర్సి నివేదికను తెప్పించుకొని వెంటనే అమలు చేయాలన్నారు.గత కొన్ని రోజులుగా పెండింగ్ లో ఉన్న డిఏ లను మంజురి చెయ్యాలని,ఉద్యోగులు,పెన్షనర్ల బకాయిలన్నీ ఏక మొత్తంలో చెల్లించాలని,ఉద్యోగుల,పెన్షనర్లకు హెల్త్ కార్డులను జారీ చేయాలని, రాష్ట్రంలో ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ మండల అధ్యక్షులు జి.బాలు నాయక్,టీఎస్ సిపిఎస్ఈయు బయ్యారం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భానోత్ రవీందర్ నాయక్,దస్తగిరి,టీపీటీఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కిషన్,భవుసింగ్ ట్రైబల్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు అజ్మీరా రూప్లా నాయక్,భద్రు నాయక్,తెలంగాణ పెన్షనర్స్ సంఘ రాష్ట్ర నాయకులు వై.హనుమంత్ ప్రసాద్,మండల ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాస రావు,సునీల్, తావు, ప్రవీణ్,కొలిపాక శ్రీనివాస్,హత్తి రామ్,మండల రెవెన్యూ ఉద్యోగులు పంచాయతీ,జిపిఓ లు, ఉద్యోగులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని తహశీల్దార్ కు వినతి.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 17.

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ పిలుపుమేరకు శుక్రవారం పిఆర్ పియు టిఎస్ బయ్యారం మండల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి మండల తహశీల్దార్ నాగరాజు కీ వినతి పత్రం అందించారు.ఈ



కార్యక్రమాన్ని ఉద్దేశించి పిఆర్ టియు టిఎస్ బయ్యారం మండల అధ్యక్షులు మోహన్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ,ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లును వెంటనే చెల్లించాలని,పిఆర్సి తక్షణమే అమలు చేయాలని,పెండింగ్ డిఏలను మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నీలం శ్రీనివాస్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు గాయత్రి, జిల్లా కార్యదర్శి సుధాకర్,మండల కార్యదర్శి సునీత,పల్లవి,రామారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ లోనే సుఖ ప్రసవం.



-ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 17.

అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి ఓ గర్భిణికి సుఖ ప్రసవం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. బయ్యారం మండలం నామాలపాడు లో ఇటుక బట్టీలలో పనిచేస్తున్న ఒడిస్సా కు చెందిన కార్మికురాలు రశ్మిత (20) భర్త కుమార్ గురువారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 కు సమాచారం అందించారు.వెంటనే స్పందించిన అంబులెన్స్ సిబ్బంది గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో నొప్పులు తీవ్రమయ్యాయి.పరిస్థితిని గమనించిన మెడికల్ టెక్నీషియన్ శ్రీను,పైలట్ ఉపేందర్ వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి,అంబులెన్స్ లోనే డెలివరీ కిట్ సహాయంతో సుఖ ప్రసవం చేశారు.రశ్మిత పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది.ఎమర్జెన్సీ రెస్పాన్స్ కేర్ ఫిజిషియన్ డాక్టర్ కాసిరెడ్డి ఫోన్ ద్వారా అందించిన సూచనల మేరకు తల్లికి ఐవి ఫ్లూయిడ్ ఇచ్చి,శిశువుకు ఆక్సిజన్ అందిస్తూ సురక్షితంగా మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం తల్లి,బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.సమయానికి స్పందించి ప్రాణాలు కాపాడిన ఈఎంటీ శ్రీను, పైలట్ ఉపేందర్ ను స్థానికులు, ఆసుపత్రి సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

## సింగారం అంగన్వాడి కేంద్రంలో గర్భవతులకు సీమంతం.





బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 17.

బయ్యారం మండలంలోని సింగారం గ్రామ పచాయతీలోని అంగన్వాడి కేంద్రంలో గర్భవతులకు సీమంతం,పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు.గర్భిణిలకు పసుపు, కుంకుమ,స్వీట్లు,పూలు,పండ్లు,చీర, గాజులతో సాంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతి రాందాస్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ గర్భవతులకు సీమంతం ద్వారా పుట్టింటి వద్ద అందాల్సిన అపూర్వ గౌరవం అంగన్వాడి కేంద్రంలో అందాలని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్,ఉపసర్పంచ్ చుంచు మమతా,అంగన్వాడీ టీచర్ గంగావత్ పద్మ,అంగన్వాడి ఆయలు,ఆశ వర్కర్లు మహిళలు పాల్గొన్నారు.

## కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించిన బచ్చలకూరి నాగరాజు....

నేలకొండపల్లి ఏప్రిల్ 17 ప్రజా వేదిక న్యూస్



తెలంగాణ ఏర్పాటుపై లోక్‌సభలో డిలిమిటేషన్ బిల్లుపై జరిగిన చర్చలో, తెలంగాణ ఏర్పాటును "బ్రిటిష్ వారు భారత్–పాకిస్థాన్‌ను విభజించినట్లుగా ఉందని కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు,ఖండించారు..తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర విభజనను అవమానించేలా ఉన్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు..లోక్ సభ సాక్షిగా ఆయన మాట్లాడిన మాటల తెలంగాణ సెంటిమెంట్‌ను దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన మండిపడ్డారు..తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడిన మాటలను తేజస్వి సూర్య వెంటనే వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని బచ్చలకూరి నాగరాజు డిమాండ్ చేశారు...

## అర్హులందరికి విబిజి రామ్ జీ జాబ్ కార్డులు అందించాలి.

-సిపిఎం మండల కార్యదర్శి మధు..

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 17.



బయ్యారం మండలం జగ్గుతండ పంచాయతీలో తురుకొనికుంటలో జరుగుతున్న విబిజి రామ్ జీ పనులను సిపిఎం పార్టీ బయ్యారం మండలం కమిటీ నాయకులు సందర్శించారు..ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి నంబూరు మధు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని పేదమధ్యతరగతి,వ్యవసాయ కూలీలు,రైతులు పట్టణ ప్రాంతాలకు వలసలు తగ్గించడానికి నాటి వామపక్షా పార్టీల పోరాట ఫలితంగా జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకురావడం జరిగిందని,ప్రతి వ్యక్తికి కనీసం 200 రోజుల పని దినాలు కల్పించాలని,పని జరిగే ప్రదేశాల్లో సేద తిరడానికి టెంటు,త్రాగునీరు,ఏదైనా ప్రమాదం జరిగితే వైద్య సదుపాయం కొరకు మెడికల్ కిట్టు ఏర్పాటు చేయాలన్నారు.ఇవన్నీ విబిజి రామ్ పథకంలో ఉన్నప్పటికీ మండల వ్యాప్తంగా జరుగుతున్న పని ప్రదేశాల్లో ఎలాంటి సౌకర్యాలు లేకుండా గతంలో మస్టర్ ద్వారా హాజరు వేయడం జరిగిందన్నారు.ప్రస్తుతం పని జరుగుతున్న ప్రదేశంలో రెండు ఫోటోలు తీయాలని నిబంధన పెట్టారని,కానీ కార్మికులు సెల్ ఫోన్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తూ ఎండలో ఇబ్బంది పడుతున్నారని,ఫోటో ఆన్లైన్లో అప్లోడ్ చెయ్యడం ఇబ్బంది ఉన్నందున దానిని తొలగించి పాత పద్ధతిలోనే మస్టర్ వేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.అదేవిధంగా అర్హులందరికి జాబ్ కార్డులను అందించాలని,రోజుకు 600 రూపాయలు పని కల్పించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ వల్లాల వెంకన్న,కో కన్వీనర్ అంగిరేకుల నాగేశ్వరరావు,కెవిపిఎస్ నిడికొండ చంటి,వార్డ్ మెంబర్ గుగులోతు రూపేష్,బొబ్బిలి వెంకన్న,కిషోర్,నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్లకు కంటి వైద్య శిబిరం





మణుగూరు ఏప్రిల్ 16 ప్రజా వేదిక న్యూస్

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు కంటి వైద్య శిబిరం:- మణుగూరు సబ్ డివిజన్ పరిధిలో పినపాక కరకగూడెం మణుగూరు అశ్వాపురం మండలాలలో ఆటోలు, లారీలు నడుపుతున్న డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం మణుగూరు సబ్ డివిజన్ పోలీస్ వారి ఆధ్వర్యంలో డీవీ ఫంక్షన్ హాల్ మణుగూరులో నిర్వహించడం జరిగినది. నాలుగు మండలాల నుండి సుమారు 200 పైచిలుకు డ్రైవర్లు ఈ వైద్య శిబిరంలో పాల్గొనడం జరిగినది. ఈ వైద్య శిబిరంలో ముందుగా ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ జి సంజీవరావు మాట్లాడుతూ దృష్టిలోపం నివారణ,కలర్ బ్లైండ్నెస్ గురించి వివరంగా తెలియజేయడం జరిగినది. మణుగూరు సబ్ డివిజన్ డి.ఎస్.పి రవీందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించడం జరిగినది. రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నియమాలు,హెల్మెట్ ధరించటం, దృష్టిలోపం ఉన్నవారు కళ్లద్దాలు ధరించి డ్రైవింగ్ చేయుట, కలర్ బ్లైండ్నెస్ ఉన్నవాళ్లు కలర్స్ ని గుర్తించకుండా రోడ్డుపై వాహనాలు నడిపి యాక్సిడెంట్లు చేయటం వీటన్నిటిమీద మాట్లాడటం, అవగాహనా కల్పించడం జరిగినది. ఈ అవగాహన వైద్య శిబిరంలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్,పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ సునీల్, మణుగూరు, అశ్వాపురం,ఏదూళ్ల బయ్యారం సర్కిల్ ఇన్స్పెక్టర్స్ నాగబాబు,అశోక్ రెడ్డి,వెంకటేశ్వరావు పాల్గొని ప్రసంగించి డ్రైవర్లకు అవగాహన కల్పించడం జరిగినది.మణుగూరు ఎస్సై నగేష్ వైద్య శిబిరం ఇంచార్జి గా వ్యహరించడం జరిగింది.

## బీసీ మహిళలకు రిజర్వేషన్లలో సబ్ కోటా ఇవ్వాలి

- పోలోజు మహేష్ చారి బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు



సూర్యాపేట ఏప్రిల్ 16 ప్రజా వేదిక న్యూస్ : జిల్లా కేంద్రం, శుక్రవారం:కేంద్ర ప్రభుత్వం మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ప్రక్రియలో భాగంగా బీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పోలోజు మహేష్ చారి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ జనాభాలో 50 శాతం పైగా ఉన్న బీసీలకు తగిన ప్రాతినిధ్యం రావాలంటే మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.ఇప్పటికే సమాజంలో వెనుకబడిన వర్గాలైన బీసీ మహిళలు రాజకీయంగా కూడా వెనుకబడుతున్నారని, వారికి చట్టసభల్లో సరైన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.రాబోయే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లను బీసీ మహిళలకు కేటాయిస్తూ వారికి న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు,కృష్ణ, సిద్ధు, నవీన్, శశిప్రీతం తదితరులు పాల్గొన్నారు...

## 10-20 పెరగనున్న మందుల ధరలు

పశ్చిమ ఆసియాలో యుద్ధ ఉద్రిక్తతల వల్ల ఏర్పడిన ముడి పదార్థాల కొరత మందుల ధరలపై ప్రభావం చూపనుంది. ఈ మేరకు ముడిపదార్థాల సరఫరాలో అంతరాయం, ఖర్చులు పెరగడంతో ధరలు పెంచాలని పలు ఫార్మా కంపెనీలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు నేషనల్ మీడియా పేర్కొంది. ఈ నేపథ్యంలో క్యాన్సర్ సహా ఇతర అత్యవసర మెడిసిన్ ధరలను 10-20 పెంచేందుకు ఆయా కంపెనీలకు కేంద్రం అనుమతిచ్చే అవకాశముందని తెలిపింది. దీనిపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నట్లు వెల్లడించింది. ఈ పెంపు 3 నెలల వరకే ఉంటుందని సమాచారం.

